

రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రనాయక్, పక్కన వైద్యులు

ఆస్పత్రిలో వైద్యుల కొరత లేకుండా చూస్తా

గచ్చిబౌలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ల కొరత లేకుండా చూస్తానని రాష్ట్ర ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. సోమవారం జిల్లా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని వాటి నివారణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని అన్నారు. నిత్యం వందలాది టైఫాయిడ్, చికున్‌గున్యా, మలేరియా, డెంగ్యూ కేసులు వస్తున్నాయని తెలిపారు. ఆస్పత్రి వార్డుల్లో తిరిగి రోగులు ఇబ్బందులు తెలుసుకున్నారు. సమయానికి వైద్యులు వస్తున్నారా? మందులు, భోజనం ఎలా ఇస్తున్నారని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల బదిలీలు జరిగాయని అందులో భాగంగా కొండాపూర్ జిల్లా ఆస్పత్రి నుంచి ఎక్కువమంది వైద్యులు బదిలీపై వెళ్లారని వారి స్థానంలో మరికొంత మంది రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాగినిరెడ్డి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

గచ్చిబౌలి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి, సర్కిల్ ఉపకమిషనర్ ముకుందరెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. డివిజన్ పరిధిలోని నేతాజీనగర్, నల్లగండ్ల హుడాకాలనీ, నానక్‌రాంగూడ, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో వర్షాలకు సీసీరోడ్లు గుంతలమయంగా మారాయని, రాకపోకలకు ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి సదుపాయం లేని ప్రాంతాలకు నీటి వసతి కల్పించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ దుర్గాప్రసాద్, డీఈ విశాలాక్షి, ఆనంద్ తదితరులు ఉన్నారు.



జడ్సీకి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

మాలధారులకు నిత్యం భిక్ష, అల్పాహారం

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ధర్మశాస్త్ర భక్తసమాజం ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ మూడో ఫేజ్‌లోని పోచమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఈనెల 2వ తేదీ (బుధవారం) నుంచి 2025 జనవరి 10వ తేదీ వరకూ మాలధారులకు నిత్యం భిక్ష, అల్పాహారం అందజేయనున్నారు. అయ్యప్ప మాలధారులతో పాటు శివయ్య, భవాని అమ్మవారి మాలధారులకు సైతం భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు గురుస్వాములు పూచా రాంబాబునాయుడు, నూతి రాంబాబు నాయుడు, బీఎస్ఎన్ రాజు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్సీ

దుండిగల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం నియోజకవర్గ ప్రజలు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్సీని కలిసి వేడుకున్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ

దుండిగల్: చాకిరిమెట్ల ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంగళవారం ఆలయంలో నిర్వహించిన యజ్ఞంలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీతో పాటు కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, 125 డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ విజయ్‌రామ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోవింద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



డీఎం హరికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

దివ్యాంగులకు ప్రత్యేక బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలి

ఫతేనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రత్యేక బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం హరిని కలిసి విజ్ఞప్తి చేశారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా డీఎంను కలిసి సమస్యలను వివరించారు. శ్రీశ్రీనగర్, ఇందిరానగర్, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల నుంచి ఎంతో మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, కానీ వారికి బస్టాపు అందుబాటులో లేదన్నారు. ఇందిరానగర్‌లో బస్టాపును ఏర్పాటు కోరారు. దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, మనోచారి, రాజుగౌడ్ పాల్గొన్నారు.



ఎంటమాలజీ, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

బాలానగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది, స్వీపర్లు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. మంగళవారం బాలానగర్ రాజూకాలనీ కమ్యూనిటీ హాలులో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషియన్ హైదరాబాద్ (ఎన్ఐఎన్), ఈఎస్ఐ వైద్య బృందం ఆధ్వర్యంలో పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 148 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఉప కమిషనర్, కృష్ణయ్య, రమేష్, ఏఎంహెచ్‌వో శ్రీనివాస్, ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలను పరిష్కరించాలి

ఫతేనగర్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలని డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీకి వినతిపత్రం మంగళవారం అందజేశారు. ఫతేనగర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఖైతాన్ బ్రిడ్జివద్ద రోడ్డు, ఆర్‌యూబీ పనులను ప్రారంభించాలని ఆమెను కోరారు. డివిజన్ పరిధిలో ఉన్న హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయడం, దీన్‌దయాల్‌నగర్, నాగార్జున కాలనీలో రోడ్డు వేయాలని కమిషనర్‌కు విన్నవించారు.



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఘనంగా బతుకమ్మ సంబరాలు



కూకట్‌పల్లిలో..

(జోన్ బృందం, ఆంధ్రజ్యోతి)

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో బతుకమ్మ ఉత్సవాలు మహిళలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో మహిళలు సంప్రదాయంగా బతుకమ్మలతో వచ్చి ఆటపాటలతో సందడి చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైతం విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. యువతులు సైతం బతుకమ్మలతో ఆడి, పాడి సందడి చేశారు.



దుండిగల్: బతుకమ్మతో విద్యార్థినులు, అధ్యాపకులు



గచ్చిబౌలి: సంస్కృతి స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



జీడిమెట్లలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ ఆడారు



భెల్ కాలనీలో బతుకమ్మలతో చిన్నారులు సందడి చేశారు.



ఎంఎల్ఆర్ఐటీ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మెట్రోరైల్ ఫెయిడ్ పార్కింగ్ అమలును విరమించుకోవాలి

మియాపూర్, అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): మియాపూర్, నాగోల్ మెట్రోరైల్వేస్టేషన్లలో పేడ్ పార్కింగ్ అమలు విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎఫ్‌డీవై డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా బేగంపేటలోని మెట్రోరైల్ భవన్‌లో హైదరాబాద్ మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌రెడ్డికి ప్రతినిధి బృందం మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ కన్వీనర్ మధుసూదన్ మాట్లాడుతూ.. అక్టోబర్ 6 నుంచి మియాపూర్ నాగోల్ మెట్రోరైల్వేస్టేషన్లలో పేడ్ పార్కింగ్ విధానాన్ని తీసుకురావాలని ఎల్‌అండ్‌టీ, హైదరాబాద్ మెట్రోరైల్ విభాగాలు చేసిన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.



మెట్రోరైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఏఐఎఫ్‌డీవై నాయకులు

పురుగులమందు తాగిన వారిలో ఒకరి మృతి

- కుటుంబం ఆత్మహత్యాయత్నంలో మరో నలుగురు ఆస్పత్రిలోనే..
- మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువుల నిరాకరణ

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రుణభారం మోయలేక.. చావే శరణ్యమని భావించి పురుగుల మందు తాగిన ఐదుగురు సభ్యులు గల కుటుంబంలో చిన్న కుమారుడు మంగళవారం మృతి చెందాడు. మిగతా నలుగురి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. కర్నూలుకు చెందిన వెంకటేశ్వర ప్రసాద్ (60), లత(55) దంపతులకు సందీప్ (30), సాయిస్వరూప్ (28), వంశీకృష్ణ (26)లు ముగ్గురు సంతానం. వెంకటేశ్వర ప్రసాద్ తొమ్మిది సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని కోదండరాంనగర్ కాలనీలో నివాసం ఉంటూ గౌతంనగర్‌కాలనీలో ఓ కిరాణ దుకాణం నడిపిస్తున్నాడు. అయితే కిరాణ దుకాణం, కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. అప్పులోళ్ల ఒత్తిడి ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఐదుగురు కుటుంబసభ్యులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం విదితమే. సంఘటనా స్థలానికి చేరుకున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐ మారయ్యలు వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మృతి

వెంకటేశ్వర ప్రసాద్, లత దంపతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ముగ్గురు కుమారులు సందీప్, సాయిస్వరూప్, వంశీకృష్ణల ఆరోగ్యం నిలకడగా ఉందని రాత్రి వెల్లడించారు. అయితే తెల్లవారుజామున వంశీకృష్ణ పరిస్థితి విషమించింది. వైద్య అందించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మృతి చెందాడు. మిగిలిన నలుగురి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారని ఎస్ఐ మారయ్య తెలిపారు.

ముందుకు రాని బంధువులు

మృతి చెందిన వంశీకృష్ణ మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు బంధువులెవరూ ముందుకు రాలేదు. చికిత్స పొందుతున్న వెంకటేశ్వరప్రసాద్ కుటుంబసభ్యులు తమ బంధువులకు సంబంధించి కర్నూలుకు చెందిన పదిహేను మంది ఫోన్ నెంబర్లను పోలీసులకు ఇచ్చారు. అయితే పోలీసులు వారందర్ని సంప్రదించగా వారు కూడా ఆసుపత్రికి వచ్చేందుకు నిరాకరించారు. చివరకు లత తల్లిదండ్రులతో ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐ మారయ్య పలుమార్లు ఫోన్ లో చర్చించి, వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో మంగళవారం రాత్రి హైదరాబాద్ వచ్చేందుకు అంగీకరించారు. దీంతో వారు వచ్చే వరకు వంశీకృష్ణ మృతదేహాన్ని మార్చురీలోనే భద్రపరుస్తామని తెలిపారు. వెంకటేశ్వర ప్రసాద్ కుటుంబం సుమారు రూ.25 లక్షల వరకు అప్పులు చేసినట్లు తెలుస్తోంది. అయితే గతంలో కర్నూలులో కిరాణ దుకాణం నిర్వహించగా అక్కడ కూడా అప్పులు కావడంతో నగరానికి వలస వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.

జ్వరాల కేసుల పరిశీలన

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో జ్వరాల తీవ్రతను పరిశీలించడానికి వైద్యాధికారులు ఆస్పత్రులను సందర్శించారు. మంగళవారం గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఏరియా ఆస్పత్రులలో పర్యటించారు. సీజనల్ కేసులు ఎన్ని ఉన్నాయి, వైద్యులు, సిబ్బంది, నర్సులు, మందుల వివరాలను తెలుసుకున్నారు. ఉస్మానియా ఆస్పత్రిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి సందర్శించారు. ఉదయం 10.30 గంటలకు ఆస్పత్రికి వెళ్లిన అధికారులు మధ్యాహ్నం వరకు వార్డులను తిరిగి ఓపీ, ఐపీలో జ్వరాల కేసులను పరిశీలించారు. డెంగీ, చికున్‌గున్యా, వైరల్ ఫీవర్ల వివరాలు తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి మందులు ఇస్తున్నారా.. చికిత్స సక్రమంగా చేస్తున్నారని అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ పాల్గొన్నారు. గాంధీ ఆస్పత్రిని టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సందర్శించారు. అక్కడి పరిస్థితులను సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి ఆయనకు వివరించారు. నిలోఫర్ ఆస్పత్రిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సందర్శించి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నాంపల్లి ఏరియా, కుత్బుల్లాపూర్ ఆస్పత్రులను అధికారులు సందర్శించారు.



బాధిత మహిళలకు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే

సీఎంఆర్‌ఎఫ్ భరోసా : ఎమ్మెల్యే

పేట్‌బషీరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉండి ఆర్థిక సాయం కోసం ఎదురుచూసే వారికి సీఎం సహాయ నిధి ఎంతో భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాజులరామారం డివిజన్‌లోని కైసర్‌నగర్ హెచ్‌ఏఎల్ కాలనీలకు చెందిన బుట్టి సంపూర్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులకు వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు స్థానికులు వివరించారు. దీంతో వారికి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీని మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆకట్టుకుంటున్న కళా సిల్క్స్ హస్తకళ ప్రదర్శన

భెల్‌కాలనీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోగల కనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ఆధ్వర్యంలో గృహోపకరణాలకు సంబంధించిన వస్త్రాలతో పాటు డ్రస్‌మెటీరియల్, కుర్తాస్, కిడ్స్‌వేర్, హోంలివిన్ వంటి చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ మగ్గాల నుంచి తయారైన వస్తువులతో పాటు తెలంగాణాలోని గద్వాల్, నారాయణపేట్‌కు చెందిన వస్త్రాలు ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ఛత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు ఈ మేళాలో ఏర్పాటు చేశారు. అక్టోబరు 16 వరకూ వరకూ ఈ ప్రదర్శన కొనసాగుతుందని, ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకూ తెరిచి ఉంటుందని నిర్వాహకులు అఫ్జల్ తెలిపారు.



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన బొమ్మలు

హైడ్రా పేరుతో పేదలను పరేషాన్ చేయొద్దు



ఎమ్మెల్యేను కలిసి గోడు వెళ్లబోసుకుంటున్న హరిజనబస్తీ మహిళలు

ఓల్డుబోయినపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో పేద ప్రజలను పరేషాన్ చేయొద్దని, లేదంటే బంగ్లాదేశ్ ప్రధానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. మంగళవారం ఉదయం కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మా యాదవ్‌తో కలిసి ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట బోయిన్‌చెరువును ఆయన సందర్శించారు. అనంతరం హరిజనబస్తీలో పర్యటించి బస్తీవాసులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శని, ఆదివారాలు వస్తే చెరువు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. తమ నివాసాలను ఎక్కడ కూల్చివేస్తారోనని కంటి మీద కునుకు లేకుండా బతుకుతున్నారన్నారు. ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తే ఊరుకోబోమని తెలిపారు. హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, మక్కల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, సయ్యద్ ఎజాజ్, హరినాథ్, యాదగిరి, పెద్ద సంఖ్యలో హరిజనబస్తీ నివాసితులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

హైదర్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్లు నరసింహయాదవ్, సతీష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, సబీహా గౌసుద్దీన్, రోజారాణి, శిరీష, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

భవిష్యత్ తరాలకు ఆరోగ్యం, ప్రశాంత జీవితం ఇవ్వాలి



ఓపెన్‌జిమ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు ఆస్తులు కాదు మంచి ఆరోగ్యం, ప్రశాంతమైన జీవితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆర్థిక సాయంతో సీఎస్ఆర్ ఫండ్ రూ.15 లక్షల 35 వేలతో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాంమోహన్‌రావుతో కలిసి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిందికుంట పార్క్‌లో ఓపెన్‌జిమ్ ఏర్పాటుకు భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్‌డైరెక్టర్ కమర్షియల్ దనుత, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **TADELA BIRLA**, S/o. Tadela Adinarayana, residing at D.No.G-6, Prasanna Plaza, Maruthi Nagar, Beeramguda, Ameenapur, Sangareddy, Telangana-502032. In my SSC Marks list my name was mentioned as **TADELU BIRLA** instead of **TADELA BIRLA**. I do hereby declared that **TADELA BIRLA** & **TADELU BIRLA** both names belongs to me.